# ప్రశ్నలు & సమాధానాలు
# ప్రశ్న 324: శాస్త్రం, ఆధ్యాత్మికం, స్వేచ్ఛాసంకల్పం
# జూన్ 15, 2024

ఈ ప్రశ్న-సమాధానాలు ప్రొ. అనిల్ కుమార్ గారి సత్యోపనిషద్, సంపుటం 1, పేజీలు 183-189 నుండి తీసికొనబడినవి

**స్వామి! శాస్త్రం, ఆధ్యాత్మికం ఒకదానికొకటి విరుద్ధమా? స్వామి ఉద్దేశం వినాలని ఆతృతగా ఉన్నాం.**

భగవాన్: శాస్త్రం ఇంద్రియాల కంటే కింద పని చేస్తుంది. శాస్త్రం 'త్వమ్' అంటే 'ఇది', ఈ ప్రపంచం గురించి శోధించడం. ఆధ్యాత్మికం 'తత్' అంటే 'అది', దివ్యత్వం గురించి యోచించడం. శాస్త్రం 'త్వమ్ ఇదమ్' అంటే ఈవల గురించి సూచిస్తే ఆధ్యాత్మికం 'పరమం' అంటే ఆవల పై కేంద్రీకరిస్తుంది. శాస్త్రం 'పదార్థం' గురించి అయితే ఆధ్యాత్మికం 'పరమార్థం' గురించి తెలియచేస్తుంది. శాస్త్రం 'జడము' గురించి మాట్లాడితే ఆధ్యాత్మికం 'చైతన్యం' గురించి బోధిస్తుంది. ఆధ్యాత్మికం 'ఆధారం' పై గురి పెడితే శాస్త్రం 'ఆధేయం' పై ప్రయోగాలు సలుపుతుంది.

శాస్త్రం 'split of love' అయితే ఆధ్యాత్మికం 'spirit of love'. శాస్త్రం 'ప్రవృత్తి' మార్గం, అంటే బాహ్య ప్రపంచ మార్గములో పోతే, ఆధ్యాత్మికం 'నివృత్తి' మార్గంలో పోతుంది. శాస్త్రం 'వ్యక్త' అంటే కనబడే దాని గురించి శోధిస్తే, ఆధ్యాత్మికం 'అవ్యక్త' అంటే దాగియున్న దాని గురించి పరిశోధిస్తుంది. శాస్త్రమును 'చర్మ చక్షువు'లతో చూడగలిగితే ఆధ్యాత్మిక మార్గమునకు 'జ్ఞాన చక్షువులు' అవసరం. శాస్త్రం తలలో దూర్చే యదార్థాల సామూహికం అయితే ఆధ్యాత్మికం హృదయమును చలింప చేసేది. శాస్త్రం C అక్షరం వలె అసంపూర్ణమైనది, ఒక చోట మొదలై ఇంకొక చోట అంతమౌతుంది. ఆధ్యాత్మికం O అక్షరం వలె పూర్ణం.

శాస్త్రం పనిముట్టులను సరఫరా చేస్తే ఆధ్యాత్మికం వాటిని ఎలా ఉపయోగించాలో బోధిస్తుంది. ఉదాహరణకి, ఒక కత్తి ఉంటే దానితో కూరగాయలను ముక్కలు చేయొచ్చు, లేకుంటే తలలు కొట్టేయొచ్చు. శాస్త్రం కళ్ళకు కనబడేది చూపిస్తుంది, ఒక ఫోటో వలె. కానీ ఆధ్యాత్మికం x-ray వంటిది. శాస్త్రం negative అయితే ఆధ్యాత్మికం positive.

ప్రకృతి negative అయితే పరమాత్మ positive. ట్యాంకులో నీరు నింపినట్లు మీ హృదయాలను positive ఆధ్యాత్మికతతో నింపుకోండి. ఇంద్రియాలు ప్రేమను ధారపోసే కుళాయిల వంటివి. శాస్త్రం యదార్థాల గురించి చెబితే ఆధ్యాత్మికం ఋతం గురించి తెలియచేస్తుంది.

**స్వామి! మేము సంసారిక ప్రేమను అనుభవిస్తాం. దానికి, ఆధ్యాత్మిక ప్రేమకి తేడా ఏంటి?**

భగవాన్: Split of love సంసారిక ప్రేమ అయితే spirit of love ఆధ్యాత్మిక ప్రేమ. తమ సంసారంతో, కుటుంబసభ్యులతో పంచుకొనే ప్రేమ split of love. అది సంసారిక ప్రేమ. విశ్వమంతటినీ పాలించే సనాతనమైన మూలకారణం ఆధ్యాత్మిక ప్రేమ. ఇదే spirit of love. ఆధ్యాత్మిక ప్రేమ విశ్వవ్యాప్తం.

**స్వామి! ఈ నడుమ అందరూ free will గురించి మాట్లాడుతుంటారు. మాకు నిజంగానే స్వేచ్ఛాసంకల్పం ఉందా?**

భగవాన్: మనిషికి స్వేఛ్ఛాసంకల్పం అనేది ఉండదు. భగవంతునికి మాత్రమే స్వేఛ్ఛాసంకల్పం ఉంటుంది. ఇంద్రియలోలుడైన మానవుడు స్వేఛ్ఛాసంకల్పం ఉందని ఎలా అనుకుంటాడు? ఈ స్వేఛ్ఛాసంకల్పం అనేది ఎక్కడ నుండి వస్తుంది? భగవంతుడు ఒక్కడే బంధాలు లేక స్వేచ్ఛ కలవాడు, అందువలన భగవంతుని ఒక్కడికే స్వేఛ్ఛాసంకల్పం ఉంటుంది. స్వేఛ్ఛాసంకల్పం అనేది దివ్యత్వానికి సంబంధించిన గుణం. ఒక చిన్న ఉదాహరణ. మనిషికి ఒక భాగంలో పెరాలిసిస్ వస్తే ఆ అంగాన్ని ఎత్తాలనుకున్నా ఎత్తలేడు. స్వేఛ్ఛాసంకల్పం ఉంది కదా మరి ప్రయత్నించమను! కనుక స్వేఛ్ఛాసంకల్పం ఉందనుకోవడం హాస్యాస్పదం.

**స్వామి! ఆధునిక సమాజంలో మనుషులకి ఉండే జ్ఞానం అసంపూర్ణ జ్ఞానం మాత్రమే. మాకు ఏ విషయం గురించి స్పష్టంగా తెలియదు. కనుక స్వేఛ్ఛాసంకల్పానికి దైవసంకల్పానికి భేదాలు ఏమిటో తెలియచేయండి.**

భగవాన్: అజ్ఞానము, అహంకారము వల్లనే ఇటువంటి సందేహాలు వస్తాయి. దేహాభిమానం వల్ల మీరు సత్యాన్ని గుర్తించలేక పోతున్నారు. నిజానికి మీరు ఇంద్రియాలకు దాసులు. కనుక మీకు స్వేచ్ఛ అనేది ఉండదు. అప్పుడు స్వేఛ్ఛాసంకల్పం అనేది ఎలా ఉంటుంది? భగవంతుడు సర్వస్వానికి ప్రభువు. అన్నిటికీ అతీతుడు. భగవంతుడిని ఏది, ఎవరూ బంధించలేరు. సంపూర్ణ స్వేచ్ఛ కలిగిన వాడు. కనుక భగవంతునికి మాత్రమే స్వేఛ్ఛాసంకల్పం, లేదా దైవ సంకల్పం కలదు.

ఈనాడు అందరికీ స్వేఛ్ఛాసంకల్పం ఉందని, అందుచేత ఏ నిర్ణయమైనా తీసుకోగలమని భావిస్తున్నారు. మీ నిర్ణయాలు ఈరోజు ఒకటి రేపు మరొకటి ఉండవచ్చు. కానీ దైవ సంకల్పం ఎన్నటికీ మారదు.

మీరు స్వేఛ్ఛాసంకల్పం అనుకొని చేస్తే గెలుపు ఓటములలో ఏదైనా కలగవచ్చు. గెలుపు కలిగితే గర్వము, అహంకారము పెరుగుతుంది. ఓటమి కలిగితే నిరాశ, నిస్పృహలు కలగవచ్చు. కానీ దైవ సంకల్పం వీటన్నిటికీ అతీతం. కనుక దైవ సంకల్పానికి లోబడిపోతే జీవితంలో మంచి కానీ, చెడు కానీ, ఏది వచ్చినా మన మంచికే అని సిద్ధంగా ఉంటారు.  అది భగవంతుని అనుగ్రహం అనుకోవాలి. ఇదే నిజమైన భక్తి, జ్ఞానము. మీకు ఏది మంచిదో మీకే తెలియదు. ఎవరికి ఎప్పుడు, ఎందుకు, ఏది, ఎలా చేయాలో భగవంతునికి మాత్రమే తెలుసు. జగత్తులో ప్రతి ఒక్కటీ దైవ సంకల్పం వల్లనే జరుగుతుంది. దీనిని మీరు శ్రద్ధతో నమ్మి భగవత్సంకల్పానికి లొంగిపోతే ఉత్సాహం, గర్వం, అహంకారం, నిరాశ, నిస్పృహల వంటివి బాధించవు.

దైవ సంకల్పము మీ అంతర్వాణి రూపంలో మీ కర్తవ్యాన్ని ఎప్పుడూ గుర్తు చేస్తూనే ఉంటుంది. కానీ మీరు వినక, అంతర్వాణి నుండి వచ్చే సందేశాన్ని నిర్లక్ష్యం చేసి తద్వారా బాధలకు గురి అవుతారు. మీ మనసును అంతరంగంలో, మీ బుద్ధిని మూలకారణంపై, మీ ఇంద్రియాలను స్వాధీనంలో ఉంచుకుంటే మీలోని అంతర్వాణి మీకు స్పష్టంగా వినిపిస్తుంది. అదియే భగవద్వాణి. దైవ సంకల్పమనేది భగవంతుని బృహత్ప్రణాళిక.

**స్వామి! భక్తికి, పరిత్యాగానికి భేదం ఏంటో చెప్పండి.**

భగవాన్: భక్తి అనేది ద్వైతం. భక్తుడు భగవంతునిపై  భక్తితో ఉంటాడు. అంటే ఆ మార్గం ద్వైతమైనది. భగవంతుడు లేకుంటే భక్తునికి సార్థకత లేదు. కానీ పరిత్యాగం అనేది అద్వైతం. అద్వైత మార్గంలో మనకు ఈ పరిత్యాగం కనిపిస్తుంది. భగవంతునికి సర్వసంగపరిత్యాగం అర్పిస్తే ఇంక భక్తుడు ఉండడు. నీకు అంటూ ఏమి ఉండదు.

ఉదాహరణకు, నీరు, చక్కెర తీసుకోండి. ఇవి రెండూ ఒక దాని నుండి ఒకటి వేరు వేరు పదార్థాలు. వాటి నామ రూప రుచులు వేరు. చక్కెర, నీరు రెండు భిన్నమైనవి కాబట్టి ఇది ద్వైత సిద్ధాంతం. అవి రెండూ కలిపేస్తే ఏమౌతుంది? అది చక్కెర కాదు, నీరు కాదు. పానకం అయిపోతుంది. అదే విధంగా భగవంతునికి సంపూర్ణ పరిత్యాగం చేసినవాడు తనను తాను భగవంతుని కంటే వేరుగా భావించడు. ఇదే అద్వైత సిద్ధాంతం.

**స్వామి! నమ్మకం, ప్రేమ, ఈ రెండింటిలో ఏది ముందు రావాలి? నమ్మకముంటేనే ప్రేమ ఉంటుందనేది నిజమేనా, లేకుంటే ముందు ప్రేమ ఉండాలా? దయచేసి తెలియచేయండి.**

**భగవాన్:** ప్రేమ రావాలంటే తప్పకుండా నమ్మకం ఉండి తీరాలి. సందేహమే లేదు. ఒకరు మీ తండ్రి, తల్లి, కొడుకు, భార్య, భర్త అని నమ్మకంగా తెలిస్తేనే వారిని ప్రేమించగలుగుతారు. ఆ నమ్మకమే లేకుంటే, వారు మీ వారని నమ్మకం లేకుంటే ఎవరినో ఎలా ప్రేమించగలరు? ఎవరి మీదైనా సందేహముంటే వారిని ప్రేమించ గలుగుతారా? కనుక నమ్మకం ముందు రావాలి, తర్వాత ప్రేమ.

**స్వామి! చాలా మంది దైవానుభావం కలిగితేనే విశ్వాసం కలిగి, ఆ తర్వాత నమ్మకం కలిగిందని చెబుతుంటారు. కానీ మరి కొందరు నమ్మకం వల్లనే అటువంటి అనుభవం కలిగిందని కూడా అంటారు. ఏది ముందు వస్తుందో చెప్పండి, స్వామి.**

**భగవాన్:** నమ్మకం ముందు కలిగి అనుభవం తర్వాత కలుగుతుంది. గాఢ నమ్మకముంటేనే అనుభవం కలుగుతుంది. నమ్మకం మూలాధారం. ఉదాహరణకి, ఈదడానికి నీటిలో దూకాలి. ఈత నేర్చుకున్నాకే నీటిలో దిగుతానని చెప్పలేవు. తారు రోడ్డు మీద, సిమెంటు రోడ్డు మీద ఈత నేర్చుకోలేరు. నీటిలోనే నేర్చుకోగలరు. ఇక్కడ నీరు నమ్మకం, ఈత అనుభవం. అంటే అనుభవం కంటే ముందు నమ్మకం ఉండాలి.

**స్వామి! 'నేనే దైవం' అని అనడం సరియేనా? లేకుంటే 'దేవుడు నాలో ఉన్నాడు' అనాలా? ఏది సరి అయినది?**

**భగవాన్:** 'సర్వం విష్ణుమయం జగత్' అని మన శాస్త్రం చెబుతుంది. భగవంతుడు సర్వవ్యాపి. విశ్వమంతటా వ్యాప్తమై ఉన్నాడు. 'వాసుదేవః సర్వమితి', 'ఈశా వాస్య మిదగ్గ్ సర్వం' అని ఉపనిషత్తులు చెబుతాయి. విశ్వమంతయు భగవంతునిలో ఉన్నదని స్పష్టంగా తెలియచేస్తాయి.

నేను భగవంతునిలో ఉన్నానని చెప్పొచ్చు. భగవంతుడు నాలో ఉన్నాడు అని చెప్పడం తప్పు. విశ్వమంతయు భగవంతునిలో ఉన్నప్పుడు నీవు కూడా భగవంతునిలోనే ఉన్నట్లు కదా. ఒక చిన్న ఉదాహరణ. నీ చేతిలో ఒక గులాబీ పువ్వు పట్టుకున్నావు. అంటే పువ్వు చిన్నది, నీవు పెద్దవాడివి. భగవంతుడు అనంతం కనుక విశ్వమంతయు అతనిలో ఇమిడి ఉంది. కానీ భగవంతుడు నీలో ఉన్నాడని తిప్పి చెబితే నీవు భగవంతుని కంటే పెద్దగా అవ్వాలి. అది సరి అయిన భావం కాదు. దైవత్వంలో నీవు ఒక అంశం. 'మమైవాంశో జీవలోకే జీవభూతః సనాతనః' అని గీత చెబుతోంది (భౌతిక జగత్తులో ఉన్న జీవాత్మలు నా యొక్క సనాతనమైన అంశములు.)

వచ్చే వారం మరిన్ని ఆధ్యాత్మిక ప్రశ్నలకు భగవాన్ వారి సమాధానాలు తెలుసుకుందాం. ధన్యవాదములు.

ఓం సాయి రాం